# మడీ, మైలా, ఆచార - వ్యవహారాలు

చాలా ఏళ్ళపాటు బారుల్లో 'తీర్థ' యాత్రలు చేసిన మా చిన్నాన్నగారు రిటైరైన మర్నాడే తీర్థయాత్రా స్పెషల్‌లో కాశీ, గయా. ఆ సందర్భంగా సహ-గమనం చెయ్యడాని కిష్టంలేక పిన్ని మా యింట్లో వుంటానంది; "తీర్థయాత్రలకు కైలాసాలూ, కాశీ ప్రయాగ లేలనో?" అని పాడుకుంటూను. ఉండనివ్వండి; చెయ్యి సాయం-? అని మా ఆవిడ (ఎ)లా చేసింది.

కూరతరిగి పెట్టడం, పని మనిషిని అజమాయిషీలో పెట్టడంతో తృప్తిపడక, వచ్చిననాడే డైనింగ్‌హాలు, వంటిల్లూ అనబడే కోట ధనాగారాలను స్వాధీనం చేసుకుంది పిన్ని. అంతేకాక బోలెడు ఆశు (తిట్టు) కవిత ప్రయోగించసాగింది. "మొహం కడుక్కోకుండానే కాఫీ ఏమిట్రా, నీ మొహం ఈడ్చా!" వంటి సహజ పాండిత్యంతో.

ఈశ్వర్రావు పెళ్ళి చేసుకున్నాడుగా, ఈ మధ్య! అతన్నీ, ఆ అమ్మాయినీ (పేరు గుర్తులేదు) భోజనానికి పిలిచాం. పెద్ద ఆఫీసరూ, మంచి ఉపకారస్తుడూ అవడంచేత జి. టి. ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వెళ్ళి నప్పట్లాగ పదిరోజులు ముందుగానే వాళ్ళని 'బుక్' చేసుకోవల సొచ్చింది. ఆ లెక్కని ఆ తేదీ పిన్ని మా యింట్లో చేరిన ఐదో రోజున వచ్చింది.

సహం భోజనం అయ్యేక పిన్ని అడిగిందతన్ని: "మీ యింటి పేరేమిటబ్బాయీ?" అని. "నక్కావారండి" అని చెప్పేశాడు, మర్మ మెరగని ఈశ్వర్రావు. "అంటే ఏ శాఖా?" అని సాగదీసింది పిన్ని. మా ఆవిడ ఎక్కణ్ణించి విన్నదో, పరుగెత్తుకొచ్చి "అత్తగారూ, వంటింట్లో కుక్క దూరింది" అని కేకేసింది సమయానికి. 'బయట చేరిందానివి వంటింట్లోకి తొంగిచూడ్డం ఏం పొయ్యేకాలమే నా శార్థం చెట్టుకింద పెట్టా?' అంటూ పిన్ని వెళ్ళింది. అంతే! ఈశ్వర్రావుకీ నాకూ రుణం తీరిపోయింది. ఆ తరవాత జరిగిన రభసతో.

పిల్లలు కాన్వెంట్‌లో చదువుతున్నారు కదా! యూనిఫారాలూ,

బూట్లూ వేసుకుని అన్నాలు తింటారు. ఉదయం, వాళ్ళకి ముందుగా వడ్డించడానికి చాలినంత చురుకులేదు. వాళ్ళని బూట్లేసుకుని డయినింగ్ టేబిల్ మీదికి రానివ్వదు. రోజూ వాళ్ళ మొహాలు ఈడ్చేయడం, వాళ్ళ శ్రాద్ధాలు చెట్టుకింద పెట్టెయ్యడం జరుగుతోంది.

నిన్న అమెరికానించి నారాయణమూర్తీ, శ్యామలా, కిరణ్ గాడూ, మల్లీ వచ్చారు. వాళ్ళు మాకు దూరపు బంధువులే. రాజమండ్రిలో మూర్తి వాళ్ళమ్మగారికి జబ్బుగా వుంది. ఆఖరి చూపులేనని వూహించి ప్లయిట్‌లో బొంబాయొచ్చి, ప్లయిట్‌లోనే హైదరాబాదూ, విశాఖపట్నం వొచ్చారు. ఇలా ఫలాన తేదీన వస్తున్నట్టు, ఆ రోజున నాలుగు గంటలకి టాక్సీ రెడీగా వుంచమనీ నాకు రాస్తే, నేను మూర్తి వాళ్ళ నాన్నగారికి రాశాను, అంచి తీసుకుని వస్తాను అంటూను. కాని, వాళ్ళని తీసుకురాడానికి నేను, మా ఆవిడా ఏరోడ్రోముకి వెళ్ళిన టయిములో రాజమండ్రి నుంచి టెలిగ్రాం వొచ్చేసింది, మూర్తి వాళ్ళమ్మగారు పోయినట్టు.

వెంటనే వెళ్ళిపోవాలని వాళ్ళకీ వుంది; మేమూ పంపించెయ్యాలి. కాని, టాక్సీ రావడానికి గంట టైం వుంది. ఈ లోపుగా భోజనాలు చెయ్యొచ్చుగా అంటే సరేనని స్నానాలు చేస్తాం అన్నారు.

బాత్‌రూం కెళ్ళడానికి పక్క వీధిలోంచి తోవ ఏర్పాటుచేసింది పిన్ని. ఎందుకంటే, కాంపౌండు గోడకి ఆనుకునివున్న సందులో బోలెడు బట్టలు ఆరేసున్నాయి. మరి! వీధి గది పూర్తిగా ఖాళీచేసి, బేసిన్‌లో అన్నం వళ్ళాలతో కూరలు సిద్ధంచేసి, విస్తరాకులు తెప్పించి అన్నీ వీధి గదిలోకి రవాణా చేయించింది. బాత్‌రూంలో డేగిసా, బకెట్లు, చెంబు అన్నీ బోర్లించింది. పసుపునీళ్ళ జల్లి మళ్ళీ వాడుకొందికి వీలుగా.

మూర్తీ శ్యామలా అన్నిటికీ సరేనన్నారు గాని పిల్లలు మాత్రం డయినింగ్ టేబిల్‌మీద తప్ప భోంచెయ్యలేమని పేచీ పెట్టారు. వాళ్ళిద్దరూ అమెరికాలోనే పుట్టారు. మాతృభాషా, పితృభాషా తెలుగే అయినా, మాట్లాడే భాషా, పాటలుపాడే భాషా ఇంగ్లీషే.

అర్జంటుగా పిన్నిని పొరుగింట్లో ఏదో పనిమీద పంపించి, వాళ్ళకి భోజనాలు ఏర్పాటు చేశాం. ఇలా వాళ్ల భోంచేసి ఇవతలి కొచ్చారో లేదో, అలా వీధి గదికి పుణ్యాహవచనం చెయ్యడానికి బ్రహ్మగార్ని బెత్తాయించుకొచ్చింది పిన్ని.

ఆవిడ భోంచేస్తూ వుండగా, కిరణ్‌గాడు ఓసారి వచ్చాం గదా అని చొరవగా డైనింగ్ రూంలో కొచ్చేసి, ఆవిడ మీదుగా వంగి, ఫ్రిజ్‌లో నీళ్ళ సీసా అందుకున్నాడు. "అయ్యో అయ్యో కొంపముంచావు గదరా నీ నెత్తి వాయించా! అసింటా పోరా, నీ మొహం యీడ్చా!" అని గగ్గోలు పెట్టింది పిన్ని.

"వాట్ వాట్" అంటూ హాట్ హాట్‌గా అడిగాడు వాడు. రాత్రికి తోడుపెట్టుకున్న పెరుగు, బోలెడు కూరగాయలు అన్నీ ఫ్రిజ్‌లోనే తగలబడిపోయాయని పిన్ని గోలెడుతూ వుండగానే టాక్సీ వచ్చేసింది.

పెద్ద సూట్‌కేసు యిక్కడే వుంచేస్తానన్నాడు మూర్తి. "ఎందుకూ, పట్టుకుపొమ్మను. దాన్నిండా గుడ్డలు కాబోలు" అంది పిన్ని. "మైలబట్టలు" అన్లేదు కదాని సంతోషించాను.

"నిండా లేవండీ; సగమే" అన్నాడు మూర్తి. నావేపు తిరిగి నువ్వు కేల్కులేటర్ అడిగావు; ఇదుగో, మీ పాపాయి నేషనల్ జాగ్రాఫిక్ ఇస్యూలు కావాలంది; తెచ్చాను అవిగో, మీ అబ్బాయి సైంకి చందా కట్టమన్నాడు; కట్టాను— అని. ఇదిగో, పిన్నిగారికి ఫెదర్‌వెయిట్ నైలెక్స్ శారీ అంటూ మైలమాట మర్చిపోయి సరాసరి ఆవిడ చేతికి అందించేశాడు.

పిన్ని అందుకుంది!

వాళ్ళు వెళ్ళాక అన్నాను. "మైల బట్ట అందుకున్నావు సచేల స్నానం చెయ్యి పిన్నీ" అని.

"ఇవి సైన్సు చీరల్రా నాయనా! శాస్త్రం పట్టుగా అనుపైన చోట మైల వుండదు!" అంది పిన్ని, చిరునవ్వుతో.

(17-3-79)